క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: 33 కేవీ ఫీడర్ లైన్ల ఎక్స్‌టెన్షన్ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని గాజులరామారం ఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కైలాస్ హిల్స్, మహదేవనగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీసీఆర్ సంస్థ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్‌లు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్

సుభాష్‌నగర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీసీఆర్ సంస్థ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సూరారంలో జిల్లా ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు సంస్థ ఆలోచన విధానాలపై అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆర్టీఐ బోర్డ్ మీద ఇచ్చిన పిటిషన్‌కు పలు ప్రభుత్వ ఆఫీసుల నుంచి వచ్చిన సమాధానాలు, తదుపరి నిర్ణయాలను, సంస్థ ఆలోచన విధానాల్ని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ పరిధిలోని కేటీఆర్ కాలనీలోని 5, 6 గల్లీల వాసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గల్లీలో ప్రతి వర్షాకాలం వరదనీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. డ్రెయిన్ నాలాను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రగిరి సతీష్, కేటీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాఘవేంద్రరావు, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

రంగారెడ్డినగర్: వెంకట్రామిరెడ్డినగర్‌లోని శ్రీసీతారామాంజనేయ విశ్వేశ్వర ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి హోమంలో స్థానికులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



రంగారెడ్డినగర్: ఐడీపీఎల్ చౌరస్తా సమీపంలో పట్వారి ఎన్‌క్లేవ్ కాలనీలోని సిరి అపార్ట్‌మెంట్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఆదివారం అటుగా రాకపోకలు సాగించే బాటసారులు, వాహనదారులను ఆపి మజ్జిగను అందిస్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. ఈ సందర్భంగా సాక్షి ప్రతినిధి వారిని వేసవిలో ప్రయాణం సాగించే చాలా మంది ఎండవేడికి ఇబ్బందులు పడుతుంటారన్నారు. వారికి ఉపశమనం కలుగుతుందనే ఉద్దేశంతో సెలవు దినాల్లో, ఆదివారం మజ్జిగను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

తరలించకుండా కాల్చేస్తారా?



రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తకు నిప్పు పెట్టొద్దనే నిబంధనలు ఉన్నా సిబ్బంది మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. సేకరించిన చెత్తను తరలించకుండా అక్కడికక్కడే నిప్పుపెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆదివారం ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ వద్ద చెట్ల మధ్యలో పోగైన చెత్తకు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నా సంబంధిత సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పైకప్పు తుప్పు.. చేయండి మరమ్మతు

- శిథిలావస్థలో షాపూర్‌నగర్ రిజర్వాయర్
- ఏళ్లుగా పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇటీవల రిజర్వాయర్‌ను పరిశీలించిన జీఎం శ్రీధర్‌రెడ్డి
- అంచన రూపొందించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశం



రిజర్వాయర్ పైకప్పును పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం అప్పలనాయుడు (ఫైల్)

చింతల్: షాపూర్‌నగర్ సబ్ డివిజన్ ఆవరణలో ఉన్న (900 కేఎల్ జీఎల్ఎస్‌ఆర్) రిజర్వాయర్ పైకప్పు శిథిలావస్థకు చేరింది. రేకులతో ఏర్పాటు చేసిన పైకప్పు ట్యాంకులోకి కుంగిపోయింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రిజర్వాయర్ పైకప్పు తుప్పుపట్టిపోయింది. ప్రతి ఇంటికి ఇక్కడి నుంచే తాగునీరు సరఫరా అవుతుంది. రేకులకు ఉన్న తుప్పు నీటిలో పడుతోందని స్థానికులు చెప్పినా పట్టించుకునే వారు లేరని పేర్కొంటున్నారు.

జీఎం ఆదేశాలు బేఖాతర్..

శిథిలావస్థకు చేరిన రిజర్వాయర్‌కు నూతన పైకప్పు వేసేందుకు జీఎం శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న డీజీఎంకు సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చారు. అయినా వారు నూతన పైకప్పు ఏర్పాటుకు ఎస్టిమేషన్ తయారు చేయకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. సుమారు రెండు నెలలు గడిచిన నూతన పైకప్పు అంచనాలు రూపొందించడంలో స్థానిక అధికారులు విఫలమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రంగంలోకి దిగిన జీఎం..

ప్రజానీకానికి తాగునీటిని అందించే షాపూర్‌నగర్ రిజర్వాయర్ మరమ్మతు పనులు నిర్వహించేందుకు జీఎం శ్రీధర్‌రెడ్డి రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం ఆయన రిజర్వాయర్ వద్దకు చేరుకొని దాని చుట్టూ కొలతలు తీసుకొని ఒక కాంట్రాక్టర్‌కు అంచనాల రూపొందించమని ఆదేశించారు. అంచనాల రూపొందించగానే టెండర్లు రూపొందించి రిజర్వాయర్‌కు మరమ్మతులతో పాటు నూతన పైకప్పు ఏర్పాటు చేస్తామని సాక్షికి తెలిపారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి



ముఖ్యఅతిథులతో ర్యాలీలో పాల్గొన్న సభ్యులు

జీడిమెట్ల: ద్విచక్ర వాహనాలు నడిపే క్రమంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎంఎల్‌ఆర్‌ఐటి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవితారెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్ ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఏసీపీ వెంకటరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. సుచిత్ర సర్కిల్ నుంచి కొంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భవిష్యత్‌పై భరోసా ఉండాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు జీవన ప్రామాణాలను పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కవిత మాట్లాడుతూ.. కార్యక్రమానికి సహకరించిన లక్ష్మణ్‌రెడ్డి, పోలీస్‌శాఖ, పాఠశాలల, కళాశాలల వారికి ధన్యవాదాలు తెలిపారు.

వేడుకగా సిక్కుల నూతన సంవత్సరం వేడుకలు



విశాల్‌గౌడ్‌కు ఖడ్గాన్ని అందజేసిన గురుద్వారా కమిటీ సభ్యులు

జీడిమెట్ల: సిక్కుల నూతన సంవత్సరం (బైసాఖీ) సందర్భంగా ఆదివారం ఎల్లమ్మ బండలోని గురుద్వారాలలో కమిటీ సభ్యులు నిర్వహించిన కార్యక్రమానికి యువనేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గురుద్వారాకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు కుర్చీలు సమకూర్చాలని కమిటీ సభ్యులు విశాల్‌ను కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. బైసాఖీ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురుద్వారాలో భోజన సదుపాయాలకు సహాయం అందించిన కిరణ్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్షుడు నాగస్ సింగ్, బహదూర్ సింగ్, కమిటీ సభ్యులు మన్న సింగ్, అమృత్ సింగ్, అక్తర్ సింగ్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లీకేజీల పర్వం.. అరికట్టడంలో నిర్లక్ష్యం



కుత్బుల్లాపూర్: మంజీరా నీరు వృథాగా పోతోంది. అధికారులు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేస్తున్నా లీకేజీల పర్వం కొనసాగుతోంది. ప్రతి నెల మెయింటెనెన్స్ పేరిట నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ మరమ్మత్తులు చేసిన వారం రోజుల్లోనే తిరిగి అదే ప్రాంతంలో లీకేజీలు కావడం అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్‌లో ప్రధాన రోడ్డుపై మంజీరా నీరు సరఫరా అయిన ప్రతిసారి రోడ్డుపై వృథాగా పారుతోంది.

స్పందించండి.. తొలగించండి

కుత్బుల్లాపూర్: ప్రధాన రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి కనిపిస్తోంది. జీడిమెట్ల డివిజన్ బౌద్ధనగర్ నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఓ మూలమలుపు వద్ద పారిశుద్ధ్య సిబ్బంది తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. సిబ్బంది సైతం వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన చెత్తను ఇక్కడ డంప్ చేయడం గమనార్హం. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



బౌద్ధనగర్ నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలి

సుభాష్‌నగర్: కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సూరారం కాలనీ రాజీవ్‌గృహకల్ప నుంచి రామ్‌లీలా మైదానం, ఓం జెండా ప్రాంతం వరకు జరిగిన ర్యాలీలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఎంఎస్ వాసు, కంది శ్రీరాములు మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న శాంతియుత వాతావరణాన్ని నాశనం చేసేందుకు పాకిస్తాన్ కుట్రలు పన్నుతోందన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యలను యావత్ దేశం ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. అమరులు జవాన్లు జోహార్లు, మీ కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు.



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



దేవేందర్‌నగర్‌లో జరిగిన గణపతి హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధి మహదేవపురంలో షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి హోమంలో ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సంతర్పణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవీన్, రంగారావు, విజయ్, రామకృష్ణ, రాజిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దు

జీడిమెట్ల: ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా పరీక్ష ఫలితాలు వెలువడకముందే ప్రత్యేక క్లాసులు నిర్వహించడం ఏమిటని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లజాన్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో గొల్లజాన్ మాట్లాడుతూ.. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కళాశాలలు క్లాసులు నడుపుతున్నాయని అన్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇప్పటి నుంచే క్లాసులు నిర్వహించడాన్ని ఎస్ఎస్‌యూఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్క ప్రైవేట్ కళాశాల ఇంటర్ బోర్డ్ నిబంధనల ప్రకారమే నడపాలని డిమాండ్ చేశారు.

భలే గిరాకీ..

సుభాష్‌నగర్: భానుడి ప్రతాపంతో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో ఎక్కడ చూసినా రోడ్ల పక్కన చెరుకు రసం, లస్సీ, సోడాలు విక్రయించే దుకాణాలు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి వీటిని తీసుకోవడంతో చిరువ్యాపారులకు భలే గిరాకీ ఏర్పడింది. పైనున్న ఈ చిత్రం సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో సాక్షి కెమెరాకు చిక్కింది.



ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వర జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: హైందవ మతోద్ధరణకు బసవేశ్వరుడు చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం సూరారం సబ్‌స్టేషన్ సమీపంలోని బసవేశ్వర చౌక్‌లో శ్రీ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, సుభాష్‌నగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద కర్ణ భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశంపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

ఇద్దరూ ఒకే వేదికపై...

- బీఆర్‌ఎస్ ప్లీనరీకి రావాలని ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే ఆహ్వానం
- చాలా కాలంతో తర్వాత ఇద్దరు కలవడంతో కార్యకర్తల్లో పెరిగిన ఉత్సాహం

కుత్బుల్లాపూర్: కొంత కాలంగా ఎడమొహం.. పెడమొహంగా ఉంటూ వస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఇద్దరూ సమావేశానికి రావడం బీఆర్‌ఎస్ పార్టీలో ఆసక్తిని రేకెత్తించింది. ఈనెల 25న కుత్బుల్లాపూర్ మున్సిపల్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశం నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్ శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయానికి వెళ్లి ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును ప్లీనరీకి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాగతోపన్యాసం, సభలో ప్రవేశపెట్టే తీర్మానాలపై చర్చించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ ఒకే వేదికపైకి రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

◆ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్ వినీత్‌కుమార్, జీడిమెట్ల డివిజన్ ఎస్సీసెల్ ప్రెసిడెంట్ ఎర్రోళ్ల శేఖర్ తమ వంద మంది అనుచరులతో ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శ్రీకాంత్, రమేష్, ప్రవీణ్, ప్రకాష్, క్రిస్టఫర్, శ్రీపాల్, వినోద్, రాజు, రాము, మన్సూర్, వేణు గోపాల్, సాయి కిరణ్, నవీన్, తరుణ్ తదితరులు పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రజలకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నాం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రజల అవసరాలకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాలనీవాసులతో ఆయన మాట్లాడారు. పనుల పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన అన్నారు. త్వరలోనే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారడం ఖాయమన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలకు పారిశుద్ధ్య సిబ్బంది రావాలని

ఆదేశించడం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి కొంపల్లి పారిశుద్ధ్య సిబ్బందిని సమావేశాలకు హాజరుకావాలని కమిషనర్, చైర్మన్ ఆదేశాలు జారీ చేయడం అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 19న కొంపల్లి మున్సిపాలిటీలోని ఏఎంఆర్ గార్డెన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి జనం రాకపోవడంతో స్థానిక పారిశుద్ధ్య సిబ్బంది సివిల్ డ్రెస్‌లో సమావేశాలకు వచ్చేలా చూడాలని రమేష్ అనే వ్యక్తికి చైర్మన్ శ్రీశైలంయాదవ్, కమిషనర్ శ్రీహరి ఆదేశించడం సిగ్గుచేటన్నారు. రమేష్ వాయిస్ మెసేజ్ బయట పడటంతో ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు నల్ల జైశంకర్‌గౌడ్ సోషల్ మీడియా వేదికగా అధికారులకు తెలియజేసే ఉద్దేశంతో పోస్ట్ చేశాడన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు వివరణ ఇవ్వకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ సిబ్బందిని సమ్మేళనానికి తరలించిన బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ నాయకుడిపై కేసు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఈ విషయంపై జాతీయ బీసీ కమిషన్, మానవ హక్కుల సంస్థను ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలపై మౌనం దేనికి?

నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు సతీష్



ఎల్లమ్మకుంట చెరువు శిఖం వద్ద నిరసనకు దిగిన బీజేపీ నాయకులు

నిజాంపేట్: ఆక్రమణకు గురవుతున్న చెరువులను పరిరక్షించి అభివృద్ధి చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. బాచుపల్లిలోని ఎల్లమ్మకుంట ఎఫ్‌టీఎల్‌లో జరుగుతున్న నిర్మాణాలపై ఆదివారం బీజేపీ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... 8.5 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎల్లమ్మ కుంట ఎఫ్‌టీఎల్‌ను మల్లంపేట్ రోడ్డు వైపు అధికార పార్టీ నాయకులు కబ్జా చేసి షెడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా కిరాయిలకు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.

◆ మిషన్ కాకతీయ పథకం ద్వారం చెరువును అభివృద్ధి చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్, ఫెన్సింగ్ వేయిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చెరువులోకి మురుగు కలవకుండా ఎల్లమ్మ కాలనీ నుంచి శ్రీహోమ్స్ మీదుగా వాగ్రకుంట వరకు నాలాను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి చెరువు సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్, అరుణ్ రావు, ప్రసాద్ రాజు, కుమార్ గౌడ్, శేషారావు, కౌశిక్, మురళీకృష్ణ, చుట్టుపక్కల కాలనీల ప్రజలు పాల్గొన్నారు.